

లక్ష్యసాధనలో వెనుకబాటు

తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో రవాణా శాఖ 82శాతమే సాధించగలిగింది. 8లో



రెక్కీ చేసి మరీ చోరీలు

సత్తుపల్లిలోని సింగరేణి క్వార్టర్లలో చోరీలకు పాల్పడిన నిందితులు ముందస్తుగా రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

నేడు పూలే జయంతి

ఖమ్మం సహకారనగర్: మహాత్మాజ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో సూచించారు. ఉదయం 9గంటలకు శ్రీశ్రీ సర్కిల్‌లోని పూలే విగ్రహం వద్ద, 10గంటలకు కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. బీసీ కులస్తులు, కుల సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో కలెక్టర్ పేర్కొన్నారు.


31లోగా రేషన్‌కార్డు దరఖాస్తుల ఆన్‌లైన్



దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీసీఓ చందన్‌కుమార్

కారేపల్లి: ప్రజాపాలన సభల్లో రేషన్‌కార్డుల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ సూచించారు. కారేపల్లి తహసీల్‌లో గురువారం ఆయన రేషన్‌కార్డుల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించాక మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీ జరిగినన్ని రోజులు రేషన్‌షాపుల్లో పరిశీలించాలని తెలిపారు. బియ్యం పంపిణీ తేదీలు, సమయపాలన బోర్డులు ఏర్పాటుచేసేలా చూస్తూ నిబంధనలపై డీలర్లకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈసమావేశంలో తహసీల్దార్ సంపత్‌కుమార్, సివిల్ సప్లయీస్ ఆర్‌ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహనం సీజ్



ఖమ్మంక్రైం: మైనర్లు వాహనాలు నడపకుండా తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. వేసవి సెలవులు రానున్న దృష్ట్యా ప్రతిరోజు వాహనాల తనిఖీలు చేపడుతామని వెల్లడించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరగడం, ఇందుకు మైనర్ల డ్రైవింగ్ కారణమని తేలిన దృష్ట్యా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గతంలో మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే జరిమానా విధించి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చేవారమని పేర్కొన్నారు. ఇకపై వాహనాలు సీజ్ చేసి, వారితో పాటు తల్లిదండ్రులను న్యాయస్థానంలో హాజరుపరుస్తామని తెలిపారు. అలాగే, ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు మార్చినా, లైసెన్స్, నంబర్ ప్లేట్లులేకున్నా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నర్సరీల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి మధుసూదన్, పక్కన డీఏఓ పుల్లయ్య

ఖమ్మంవ్యవసాయం: మిరప నర్సరీల బాధ్యులు అన్ని నిబంధనలు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన నర్సరీల నిర్వాహకులు, వ్యవసాయ, ఉద్యాన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలతో ఉద్యాన అధికారుల పరిశీలనలోనే నర్సరీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. తద్వారా రైతులకు కల్తీ లేని నారును అందించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు లైసెన్స్ తీసుకోవడమే కాక పూర్తి వివరాలతో రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. ఏడీఏ వాసవీరాణి, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగర్ కాల్వలకు నీరు నిలిపివేత

నాగార్జునసాగర్: సాగర్ కుడి, ఎడమ కాల్వలకు గురువారం సాయంత్రం నీటి విడుదల నిలిపివేశారు. యాసంగి పంటలకు గాను అధికారులు గత ఏడాది డిసెంబర్ 15 నుంచి ఆయకట్టుకు ఏకధాటిగా నీరు విడుదల చేస్తున్నారు. కుడికాల్వ కింద ఏపీలో 10.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అలాగే, ఎడమకాల్వ కింద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,98,790 ఎకరాలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2,63,736 ఎకరాల్లో వరి సాగైంది. ఈ సీజన్‌లో 115 రోజుల పాటు కుడి కాల్వకు 100టీఎంసీలు, ఎడమ కాల్వకు 74టీఎంసీల నీటిని విడుదల చేశామని అధికారులు వెల్లడించారు.

పావు గంటలోనే ఫటాఫట్

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం

- పైలట్‌గా మూడు కార్యాలయాల్లో అమలు
- తొలిరోజు చిన్నచిన్న సమస్యలు మినహా సాఫీగానే..
- వచ్చే నెల 1నుంచి అన్ని కార్యాలయాల్లో అమలు



ఖమ్మం ఆర్‌ఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారి వేలిముద్రలు సేకరిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఒక దస్తావేజు రిజిస్ట్రేషన్ కోసం రోజంతా వేచి ఉండకుండా ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ముందుగానే సమయాన్ని నిర్దేశించుకుని స్లాట్ బుక్ చేసుకునే విధానాన్ని అమలుచేస్తుండగా, పావు గంటలోనే ప్రక్రియ పూర్తిచేసి దస్తావేజులు ఇచ్చేస్తున్నారు.

తొలి రోజు రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ల వివరాలు..

కార్యాలయం	స్లాట్ ద్వారా రిజిస్ట్రేషన్లు	వాకిన్ రిజిస్ట్రేషన్లు	మొత్తం
ఖమ్మం ఆర్‌వో	31	06	37
కూసుమంచి	13	00	13
కొత్తగూడెం	22	01	23



రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మహిళకు దస్తావేజు అందజేస్తున్న ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 సంపత్

ఈ విధానంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారిలో హర్షం వ్యక్తమవుతోంది. ఇక స్లాట్ దొరకని వారు, బుక్ చేసుకోలేని వారి కోసం ప్రతిరోజు సాయంత్రం 5 – 6 గంటల మధ్య వాకిన్ విధానంలో ఐదు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని పలు కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాగా, ఉమ్మడి జిల్లాలోని మూడు కార్యాలయాల్లో గురువారం మొదలైంది. తొలి రోజు మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 68 స్లాట్లు బుక్ కాగా, 66 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అలాగే, వాకిన్ విధానంలో ఏడు దస్తావేజుల రిజిస్ట్రేషన్ చేశామని అధికారులు వెల్లడించారు.

స్లాట్ బుక్ చేసుకుని..

దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే, ఈ ప్రక్రియ పూర్తవడానికి సమయం పడుతుండడం.. ఒకే సమయంలో ఎక్కువ మంది వస్తే అధికారులు దస్తావేజులను సక్రమంగా పరిశీలించలేని పరిస్థితి ఎదురయ్యేది. దీంతో ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం అమలుకు నిర్ణయించగా, పైలట్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, కూసుమంచి, కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను జాబితాలో చేర్చారు. గురువారం మొదలైన ఈ విధానంలో భాగంగా స్లాట్ బుక్ చేసుకున్న సమయం ఆధారంగా వచ్చిన వారి దస్తావేజులను అధికారులు పరిశీలించి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. అంతేకాక రిజిస్ట్రేషన్ పత్రాలను కూడా అందజేశారు. వచ్చే నెల 1వ తేదీ నుండి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి రానుంది.

చిన్న చిన్న సమస్యలు మినహా..

డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం స్లాట్ బుక్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో తొలిరోజు సర్వర్‌లో చిన్న చిన్న సమస్యలు ఎదురయ్యాయి. సర్వర్ నెమ్మదించడం, డాక్యుమెంట్ వివరాలను నమోదు చేస్తున్న సమయంలో వాటికవే డిలీట్ కావడంతో మళ్లీ మొదటి నుంచి నమోదు చేయాల్సి వచ్చింది. దీంతో వీటిని సరిచేసి, ఇంకొన్ని అంశాలను సైట్‌లో చేరిస్తే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా సాగుతుందని అధికారులు వెల్లడించారు.

అధికారుల పర్యవేక్షణ

ఉమ్మడి జిల్లాలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలుకావడంతో అధికారులు పర్యవేక్షించారు. జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు ఖమ్మం, కూసుమంచి కార్యాలయాల్లో, చిట్ రిజిస్ట్రార్ కార్తీక్ కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. స్లాట్ బుక్ చేసుకుని డాక్యుమెంట్లతో సబ్‌రిజిస్ట్రార్ వద్దకు వచ్చిన క్రయవిక్రయదారులకు పదిహేను నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ చేయడం, ఆపై పది నిమిషాల్లో పత్రాలు ఇవ్వడం విశేషం. బయోమెట్రిక్, ఫొటో, డాక్యుమెంట్ల పరిశీలన, స్కానింగ్ అంతా ఈ సమయంలోనే పూర్తయింది.



కూసుమంచి కార్యాలయంలో డాక్యుమెంట్ అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్ పద్మ

ఇబ్బంది తప్పింది..



స్లాట్ రిజిస్ట్రేషన్ కోసం ముందే స్లాట్ బుక్ చేసుకుని కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రాగా, త్వరగా పని పూర్తయింది. గతంలో రోజంతా పని వదులుకుని వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు 30 నిమిషాల్లోపే పని పూర్తవడంతో సమయం ఆదా అయింది.

– అనుమెల రమేష్, ఖమ్మం

ఈ విధానం బాగుంది..



డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుక్ విధానం బాగుంది. మనకు వీలున్న సమయంలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఆ సమయంలో వస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని త్వరగా వెళ్లిపోవచ్చు. గంటల తరబడి వేచి ఉండకుండా ప్రవేశపెట్టిన ఈ విధానం బాగుంది.

– ఎం.వెంకటనారాయణ, విజయవాడ

పాలేరు వదిలి ఎక్కడికీ వెళ్లను..

- ఈ ప్రాంత అభివృద్ధి, ఇక్కడి ప్రజలే ముఖ్యం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఇస్లావత్‌తండాలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: వేరే నియోజకవర్గానికి తాను వెళ్లనున్నట్లు వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదరించి, అక్కున చేర్చుకున్న పాలేరు ప్రజలు, ఈ ప్రాంత అభివృద్ధే తనకు ప్రధానమని స్పష్టం చేశారు. తిరుమలాయపాలెం మండలంలోని ఇస్లావత్‌తండా, మేడిదపల్లి, తెట్టెలపాడు, పిండిప్రోలు, తిరుమలాయపాలెంల్లో పలు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించిన మంత్రి, తెట్టెలపాడు, తిరుమలాయపాలెంల్లో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గానికి తాను వెళ్తున్నట్లు వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మొద్దని సూచించారు. పాలేరు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మంత్రిగా ఉన్న తాను ఈ ప్రాంత అభివృద్ధి కోసం శక్తిమేరకు కృషి చేస్తానని తెలిపారు.

పేదల కోసమే ప్రభుత్వం

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసమే ఏర్పడిందని.. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నెలకు రూ.6,500 కోట్ల వడ్డీ కడుతూనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.14 కోట్లతో రోడ్లు మంజూరు చేశామని వెల్లడించారు. కాగా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు పార్టీలకతీతంగా అర్హులందరికీ అందిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్లలో 20 లక్షల గృహాలు నిర్మించే లక్ష్యంతో ఉండగా.. ఈ ఏడాది 4.5లక్షల ఇళ్లు పూర్తిచేస్తామని చెప్పారు. గత ఏడాది వరద బీభత్సంతో దెబ్బతిన్న రాకాసితండా ప్రజల వినతి మేరకు ముఖ్యమంత్రితో చర్చించి 52 మంది పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు మంజూరు చేశామని, వీరికి ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు అవుతాయని మంత్రి పేర్కొన్నారు. అనంతరం 56 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా సహకార అధికారి గంగాధర్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ ఎస్‌ఈలు యుగంధర్, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ నర్సింహారావు, ఏడీఏ సరిత, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, తహసీల్దార్ సుధీర్, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ సొసైటీ చైర్మన్లు చావా వేణు, రామసహాయం నరేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు బెల్లం శ్రీనివాస్, బోడ మంగీలాల్, కొప్పుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా మామిడి మార్కెట్

- రైతులకు లబ్ధి జరిగేలా తాత్కాలికంగా ఏర్పాటు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వివిధ రకాల మామిడి పండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవ్యవసాయం: మామిడి రైతులు దూరప్రాంతాలకు వెళ్లకుండా జిల్లాలోనే అమ్ముకునేలా తాత్కాలిక మార్కెట్‌ను వారంలోగా అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. ఖమ్మంలో గురువారం జరిగిన మామిడి పండ్ల కొనుగోలు, అమ్మకందారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక మార్కెట్ ఏర్పాటుతో రైతులకు మధ్యవర్తుల బాధ తప్పుతుందని, వినియోగదారులకు మేలైన రకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వచ్చే ఏడాది నాటికి ప్రభుత్వంతో చర్చించి శాశ్వతంగా మామిడి మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. కాగా, సేంద్రియ పంట ఉత్పత్తుల వినియోగంతో లాభాలు ఉన్నందున రైతులు సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు ప్రతీనెల అవగాహన సదస్సులు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం మామిడి మార్కెటింగ్‌పై రూపొందించిన బ్రోచర్లను కలెక్టర్ ఆవిష్కరించగా, మామిడి సాగు, కోతలు, సస్యరక్షణ, మార్కెటింగ్‌పై అధికారులు అవగాహన కల్పించారు. రైతు కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ బాబు, ఆపెడా మేనేజర్ నాయుడు, యూనివర్సిటీ డైరెక్టర్ కిరణ్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం.వీ.మధుసూదన్, జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం, ఉద్యాన అధికారులు వేణు, నగేష్, విష్ణు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ మామిడి విక్రయాలు

రైతులు సేంద్రియ విధానంలో సాగు చేసిన మామిడి కాయలు విక్రయించుకునేలా ఖమ్మం రోటరీనగర్ వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని కేటాయిస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈమేరకు నిరుపయోగంగా ఉన్న వీధివ్యాపారుల ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన నేరుగా రైతులే విక్రయించేలా అప్పగించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్, డీఏంఓ అలీం, డీసీఓ గంగాధర్, బీసీడబ్ల్యూఓ జ్యోతి, మున్సిపల్ ఈఈ కృష్ణాలాల్ పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించండి

- బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌పై ప్రత్యేక దృష్టి
- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన శ్రీధర్‌బాబు

ఖమ్మంవన్‌టౌన్: ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విస్తృత అవకాశాలు పెరుగుతుండడం, అపారమైన అవకాశాలు ఉన్నందున ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. ఆహార ప్రాసెసింగ్ రంగంపై టీఎస్‌ఐసీ సీఈఓ టి.మధుసూదన్, ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్‌తో కలిసి హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్క్‌పై ప్రత్యేక దృష్టి సారించి కంపెనీలు ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రవాణాపరంగా ఖమ్మం – రాజమండ్రి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులో ఉండగా, విజయవాడ, మచిలీపట్నం పోర్టులు సమీపాన ఉండడం కలిసొస్తుందని చెప్పారు. అంతేకాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విరివిగా సాగయ్యే మామిడి, కోకో, ఆయిల్‌పామ్, కొబ్బరి ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు వసతులు ఉన్న విషయమై పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించాలని, తద్వారా కంపెనీలు ఏర్పాటైతే రైతులకు లాభం జరుగుతుందని మంత్రులు తెలిపారు. అయితే, ధరలు ఎక్కువగా ఉండడంతో పెట్టుబడిదారుల ముందుకు రావడం లేదని అధికారులు వెల్లడించగా, ఈ విషయంలో పునఃసమీక్షించాలని ఆదేశించారు.

కేజీబీవీల్లోనూ చార్జీల పెంపు

ఉమ్మడి జిల్లాలో 8,480 మంది బాలికలకు ప్రయోజనం



ఖమ్మం రూరల్ మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం

పాల్వంచరూరల్ : ఎట్టకేలకు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో విద్యార్థినుల కాస్మొటిక్స్, డైట్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతేడాది డిసెంబర్ 13న సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు చార్జీలు పెంచిన ప్రభుత్వం.. తాజాగా కేజీబీవీ విద్యార్థినులకూ పెంచింది. గతంలో అమలు చేసిన చార్జీలు, నిత్యం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఇచ్చే బిల్లుల్లో తేడా ఉండడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ క్రమంలో కేజీబీవీ విద్యార్థినులకూ డైట్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచారు.

గతంలో అన్ని తరగతులకూ ఒకే చార్జీలు..

గతంలో 6నుంచి ఇంటర్మీడియెట్ వరకు అన్ని తరగతుల విద్యార్థినులకు డైట్ చార్జీలు నెలకు రూ.1,225, కాస్మొటిక్స్ చార్జీ రూ.100 చెల్లించేవారు. తాజా మార్పుతో 6, 7వ తరగతుల వారికి డైట్ చార్జీలు రూ.1,330 చొప్పున, కాస్మొటిక్స్ చార్జీలు రూ.175 చొప్పున చెల్లిస్తారు. ఇక 8, 9, 10వ తరగతుల విద్యార్థినులకు డైట్ చార్జీలు రూ.1,540, కాస్మొటిక్స్ చార్జీలు రూ.275 ఇవ్వాలని నిర్ణయించారు. ఇంటర్ విద్యార్థినులకు డైట్ చార్జీలు రూ.2,100, కాస్మొటిక్స్ చార్జీలు రూ.275 చొప్పున అందుతాయి.

ఉమ్మడి జిల్లాలో 28 విద్యాలయాల్లో..

ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో 14 చొప్పున కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 6నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థినులు 4,780 మంది ఉండగా, భద్రాద్రి జిల్లాలో 3,700 మంది ఉన్నారు. బాలికలకు నెలలో నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్ పెట్టడమే కాక, వారంలో బుధవారం మినహా మిగతా రోజుల్లో అరటి లేదా సీజనల్‌గా లభించే పండ్లు, సేమియా, గులాబ్‌జామ్, అటుకులు, స్నాక్స్, పల్లీపట్టి, మిక్చర్, టీ సమకూర్చాల్సి ఉంటుంది. కానీ పాత చార్జీలతో వీటి అమలు కష్టంగా మారేది. ప్రస్తుతం బాలికలకు బలవర్ధకమైన ఆహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం మెనూచార్జీలు పెంచింది. అయితే, కొత్త చార్జీలు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయనే విషయంలో స్పష్టత లేకపోగా, వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలయ్యే అవకాశముందని తెలుస్తోంది.

పండుగలు పోయాయి...

- పూర్తికాని మంచుకొండ 'లిఫ్ట్' పనులు
- ఉగాదికి సాధ్యం కాని ట్రయల్ రన్
- మోటార్ల రాకలో ఆలస్యంతో జాప్యం
- సిద్ధిపేట నుంచి తెప్పించేందుకు యత్నాలు?



ముగింపు దశకు చేరిన పంపుహౌస్ నిర్మాణం



పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: ఉగాది పండుగ నాటికి రఘునాథపాలెం మండలంలోని రైతుల భూములకు సాగర్ జలాలను అందించేలా మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. కానీ ఉగాది, ఆతర్వాత శ్రీరామనవమి పోయినా అది సాధ్యం కాలేదు. దీంతో గడువును ఈనెల 20వ తేదీకి మార్చినా మోటార్లు ఇంకా చేరకపోవడంతో ఆ సమయానికి కూడా నీటి ఎత్తిపోతలపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.66కోట్లతో నిర్మాణం

ఎలాంటి సాగునీటి వనరులు లేని రఘునాథపాలెం మండలంలోని గ్రామాలకు సాగర్ జలాలు సరఫరా చేయాలనే లక్ష్యంతో సాగర్ ప్రధాన కాల్వపై వీ.వీ.పాలెం వద్ద మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా 33కు పైగా చెరువులకు సాగర్ నీరు తరలించి ఆయకట్టును స్థిరీకరించాలనేది లక్ష్యం. రూ.66 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు గత జనవరి 13న శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో ఉగాది నాటికి నీరు సరఫరా చేస్తామని ప్రకటించారు.

పంప్‌హౌస్ స్లాబ్ పూర్తి

వీ.వీ.పాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వ సమీపాన పంపుహౌస్ నిర్మించి అక్కడి నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడి ప్రత్యేక పైపులైన్ ద్వారా తరలించాల్సి ఉంటుంది. 900 ఎం.ఎం. డయాతో కూడిన ప్రధాన పైపులైన్‌ను 9 కి.మీ. మంచుకొండ వరకు వేయాల్సి ఉండగా.. 90శాతం మేర పనులు పూర్తయ్యాయి. రోడ్ల కటింగ్ వద్ద ఈ పనులు కొనసాగుతున్నాయి. అలాగే, సాగర్ కాల్వ వద్ద పంపుహౌస్ నిర్మాణం స్లాబ్ దశను దాటింది. అక్కడ మోటార్లు అమర్చాల్సి ఉండగా ఇప్పటివరకు చేరలేదు. ఇది కాక ప్రధాన పైపులైన్ నుంచి మండలంలోని 33 చెరువులకు నీరు సరఫరా చేసేందుకు 700, 500, 400 ఎం.ఎం. డయాతో కూడిన 50 కి.మీ. మేర ఆరు పైపులైన్లు వేయాల్సి ఉంటుంది.

మోటార్లు ఏవీ?

పంపుహౌస్‌లో 600 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్లు అమర్చి నీరు ఎత్తి పోయాల్సి ఉంటుంది. కానీ మోటార్ల కొనుగోలుకు అగ్రిమెంట్ పూర్తయినా ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా చేయడానికి ఇంకా సమయం పడుతుందని ఏజెన్సీ బాధ్యులు చెప్పినట్లు తెలిసింది. అయితే, ట్రయల్ రన్ కోసం ఒక్క మోటారు సమకూర్చాలని కోరినా ఫలితం కానరాలేదని సమాచారం. దీంతో ఈనెల 20వ తేదీ నాటికి పనులు పూర్తిచేసి ట్రయల్ రన్ చేపట్టాలనే లక్ష్యంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా సిద్ధిపేటలో జిల్లాలో ఒక మోటార్ అదనంగా ఉందని తెలియడంతో ఆ మోటార్‌ను తెప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తద్వారా ఆ మోటార్ వస్తే సాగర్ జలాలు కాల్వలో నిలిచిపోయేలోగా ఈనెల 20వ తేదీ నాటికి ట్రయల్ రన్ నిర్వహించాలని భావిస్తున్నారు. ఇక ఎత్తిపోతల పథకం కోసం ప్రత్యేక సబ్ స్టేషన్ నిర్మించాల్సి ఉండగా స్థలాన్ని ఖరారు చేశారు. దీంతో మోటార్ నడిచేందుకు తాత్కాలికంగా లైన్ వేయడంపై దృష్టి సారించారు.

రైతులను ఒప్పిస్తూ పనులు

పైపులైన్ నిర్మాణానికి కొందరి పొలాల్లో తవ్వాల్సి వస్తోంది. మిర్చి, మొక్కజొన్న, పుచ్చ పంటలు సాగులో ఉండడంతో రైతులు అభ్యంతరం చెబుతున్నారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు వారిని ఒప్పించి ముందుకు సాగుతున్నారు. కొంత మేర పరిహారం కూడా ఇప్పిస్తామని నచ్చచెబుతున్నట్లు తెలిసింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తరచుగా సమీక్షిస్తూ పనుల్లో వేగం పెరిగేలా చూస్తున్నారు.

20లోగా ఎత్తిపోతలకు యత్నం

ఎత్తిపోతల పథకానికి అవసరమైన మోటార్లు సరఫరాలో జాప్యం జరుగుతోంది. మోటార్లు చేరకపోతే ఇతర ప్రాంతాల నుంచి తెప్పించైనా ఈనెల 20వ తేదీ నాటికి సాగర్ నీటిని ఎత్తిపోయాలనే లక్ష్యంతో ఉన్నాం. పైపులైన్, పంపుహౌస్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. మోటార్, పంపులు అమరిస్తే నీరు విడుదల చేయొచ్చు.

– ఎం.వెంకటేశ్వర్లు ఎస్‌ఈ, జలవనరులశాఖ

క్లుప్తంగా

నర్సింగ్ విద్యార్థినికి చేయూత


విద్యార్థినికి చెక్కు అందిస్తున్న రామారావు

కల్లూరు: మండలంలోని పేరువంచకు చెందిన మర్రేల వెకంటేశ్వరరావు కుమార్తె నాగ స్నేహిత వనపర్తి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. అయితే, కళాశాల, ఫీజులు, ఇతర ఖర్చులు భరించే పరిస్థితి లేకపోవడంతో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావును సంప్రదించారు. ఈమేరకు ఆయన ఫౌండేషన్ నిర్వాహకులతో మాట్లాడి గురువారం నాగస్నేహితకు రూ.62 వేల చెక్కు అందజేశారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పని చేస్తున్న అభ్యర్థులు ప్రైవేట్‌గా ప్రవేశాలు పొంది పరీక్ష రాసేందుకు ఉపాధి, శిక్షణ సంస్థ డైరెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఖమ్మం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఐటీఐలో ప్రవేశానికి సంబంధిత ట్రేడ్‌లో మూడేళ్ల అనుభవంతో పాటు ఈఎస్ఐ/పీఎఫ్ చందాదారులై ఉండాలని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, డీఎం సివిల్, ఎలక్ట్రానిక్ విభాగాల్లో రెండు చొప్పున, వెల్డర్ విభాగంలో నాలుగు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఉద్యోగ గుర్తింపు కార్డుతో వరంగల్ ములుగురోడ్డులోని ప్రాంతీయ కార్యాలయంలో రూ.100 చెల్లించి దరఖాస్తు తీసుకుని, పూర్తిచేశాక ఈనెల 17లోగా అక్కడే సమర్పించాలని సూచించారు.

కూలీల ఆటో బోల్తా..

8మందికి గాయాలు

నేలకొండపల్లి: మిర్చి ఏరేందుకు ఏపీకి వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడడంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని బుద్ధారానికి చెందిన కూలీలు మిర్చి తోటలు వేరేందుకు కొన్నాళ్లుగా ఏపీకి వెళ్తున్నారు. గురువారం ఏపీలోని కన్నెవీడు గ్రామానికి ఆటోలో 10మంది కూలీలు బయలుదేరగా, మల్లారంలో రహదారుల వెంట ధాన్యానికి అడ్డుగా పెట్టిన రాయిపైకి ఎక్కడంతో ఆటో బోల్తా పడింది. దీంతో డ్రైవర్ నర్సింహారెడ్డి, కూలీలు రెంటాల వెంకటమ్మ, సీతారాములు, భూలక్ష్మి, నాంపల్లి సైదమ్మ, షేక్ సైదాబీ, నాంపల్లి లక్ష్మితో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చేరుకుని వారిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం పాత బస్టాండ్‌లో గురువారం చేపట్టిన తనిఖీల్లో వన్ టౌన్ పోలీసులు ఐదు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన చెందిన శిబరామ్ గంజాయితో సహా కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి, సూర్యాపేట మీదుగా పల్లె వెలుగు బస్సుల్లో హైదరాబాద్ వెళ్లడానికి పాత బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఈక్రమాన పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఆయన వద్ద ఐదు కేజీల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకుని శిబరామ్‌ను రిమాండ్‌కు తరలించారు.

రెక్కీ చేసి మరీ చోరీలు..

- సరిగ్గా ఏడాది క్రితం ఇదే తరహాలో దొంగతనం
- సింగరేణి ఉద్యోగులే దుండగుల లక్ష్యం?



సత్తుపల్లిలోని సింగరేణి క్వార్టర్లు




సీసీ కెమెరాల్లో నమోదైన నిందితుల చిత్రాలు

సత్తుపల్లి: సరిగ్గా ఏడాది క్రితం మొఖానికి కర్చీఫ్ కట్టుకుని వచ్చిన దుండగులు వరుసగా చోరీలు చేశారు. సీసీ కెమెరాల్లో వారు నమోదైనా ముఖాలు కనిపించకపోగా ఇంకా కనిపెట్టలేకపోయారు.సత్తుపల్లిలోని సింగరేణి క్వార్టర్స్‌లోని పలువురి ఇళ్లలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరగగా, నిందితులు రెక్కీ చేసి మరీ వచ్చినట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెండురోజుల క్రితం క్వార్టర్స్ కాలనీలో కరపత్రాలు పంచుతూ అనుమానాస్పద వ్యక్తులు సంచరించారని స్థానికుల ద్వారా తెలిసింది. దీనికి తోడు తాళం వేసి ఉన్న ఇళ్లలోనే చోరీ జరగడంతో ముందుగా ఇళ్లను ఎంపిక చేసుకుని ఉంటారని తెలుస్తోంది.

నాలుగేళ్ల క్రితం..

సత్తుపల్లిలో నాలుగేళ్ల క్రితం సింగరేణి ఉద్యోగుల ఇళ్లను టార్గెట్ చేస్తూ వరుస దొంగతనాలు జరగడంతో అప్పట్లో సంచలనంగా మారింది. సింగరేణి ఉద్యోగులు ఇళ్లల్లో ఉండటానికే జంకాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో తమకు క్వార్టర్లు నిర్మించి ఇవ్వాలని ఉద్యోగులు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో క్వార్టర్ల నిర్మాణం పూర్తిచేసి వారికి కేటాయించగా.. అందులోకి వచ్చిన వారి ఆనందం మూణ్నాళ్లు కూడా నిలవలేదు. రెండు నెలల క్రితం సింగరేణి క్వార్టర్స్‌కు వెళ్లే రోడ్డులో వాకింగ్ చేస్తున్న మహిళల నుంచి గొలుసులు లాక్కెళ్లారు. ఇప్పుడు ఏకంగా ఎనిమిది ఇళ్లల్లో సుమారు రూ.80లక్షలకుపైగా బంగారం, నగదు, వెండి వస్తువులు చోరీ చేయడంతో పోలీసులు విచారణపై దృష్టి సారించారు.

నక్కినక్కి..

సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తే ముఖాలకు కర్చీఫ్ కట్టుకొని, మాస్కులు ధరించి వచ్చిన దండుగులు నక్కినక్కి వెళ్లినట్లు నమోదైంది. దీంతో వీరు అంతర్రాష్ట్ర దొంగలు కావొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల జరిగిన చోరీల్లో కొన్ని...

- ఈ ఏడాది జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ టీచర్ అలీం ఇంట్లో దొంగతనం జరిగి బంగారు నగలు చోరీ చేశారు. ఇప్పటి వరకు దాని జాడ లేదు.
- గతేడాది ఏప్రిల్‌లో వేంసూరు రోడ్డులోని పాత, కొత్త సొసైటీ కార్యాలయాలు, రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం, అన్నపూర్ణ మెస్‌లో అర్ధరాత్రి వరుస చోరీలకు పాల్పడ్డారు. ఆ సమయంలో సీసీ కెమెరా ఫుట్ హార్డ్‌డిస్క్ కూడాఎత్తుకెళ్లారు.
- 2023 నవంబర్ 21న విద్యానగర్‌రోడ్‌లోని రతికంటి ప్రభాకర్‌రావు ఇంట్లో 260 గ్రాముల బంగారు నగదు, కేజీన్నర వెండి వస్తువులు, రూ.1.50 లక్షల నగదు చోరీకి గురైంది. ఈ కేసు కూడా ఇప్పటి వరకు పురోగతి లేదు.
- 2023 సెప్టెంబర్ 23న బైపాస్‌రోడ్‌లోని మారుతి బంగారు వీధిలో నివాసం ఉంటున్న జామెమసీద్ ఉద్యోగి ఎస్‌కె జాని తెల్లవారు జామున లేచి మసీదుకు వెళ్లితే ఆ సమయంలో ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.50వేల నగదు, ఏడు కాసుల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. దీనిపైనా పురోగ కానరాలేదు.
- సత్తుపల్లిలో రెండేళ్ల వ్యవధిలో సుమారు 15 మోటారు సైకిళ్ల వరకు దొంగతనాలు జరిగాయి. వీటిలో ఏది కూడా చేయలేకపోయారు. పలుమార్లు తిరిగినా ఫలితం ఉండటం లేదని బాధితులు వాపోతున్నారు.

లోకాయుక్తలో ఫిర్యాదుపై.. అదనపు కలెక్టర్ విచారణ


కొణిజర్ల సమీపాన వెంచర్‌లో విచారిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కొణిజర్ల: కొణిజర్ల సమీపాన ఓ వెంచర్ నిర్వాహకుడు అమ్మపాలెం – లింగగూడెం డొంక దారిని ఆక్రమించుకుని రోడ్డు నిర్మిస్తున్నాడని ఖమ్మంకు చెందిన శ్రీనివాసరావు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఈ విషయమై గురువారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, ఐబీ అధికారులతో కలిసి వెళ్లిన ఆమె స్థానిక రైతులతో మాట్లాడారు. గతంలో 15అడుగులు డొంక ఉండేదని, ప్రస్తుతం 40 అడుగులుగా చేసి రోడ్డు నిర్మిస్తుండడంతో తమకెలాంటి ఇబ్బందులు లేవని రైతులు తెలిపారు. దీంతో రైతులకు ఇబ్బంది ఉంటే వారే ఫిర్యాదు చేస్తారు కదా అంటూ ఫిర్యాదుదారుడిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రైతుల అభిప్రాయాలతో నివేదిక పంపించాలని తహసీల్దార్ రామును ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

కొణిజర్ల మండలం చిన్నగోపతిని ఇందిరమ్మ ఇళ్లకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినందున నిర్మాణాల్లో వేగం పెరిగేలా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. చిన్నగోపతిలో 52 ఇళ్లు మంజూరు కాగా 43 నిర్మాణాలు బేస్‌మెంట్ స్థాయికి చేరాయి. దీంతో పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ మరింత వేగం పెంచాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, బస్వాపురంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఎంపీడీఓ రోజారాణి, తహసీల్దార్ రాము, ఎంపీఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఊంజల్ సేవలో కల్యాణ రామయ్య

భద్రాచలం: సీతాలక్ష్మణ సమేతుడైన కల్యాణ రామయ్యకు గురువారం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. దేవస్థానంలో జరుగుతున్న వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాములను ఊయలలో కొలువుదీర్చిన అర్చకులు లాలలు.. జోలలు పాడారు. ఆస్థాన హరిదాసులు భక్త రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలు ఆలపించగా ఊంజల్ సేవ ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం స్వామివారికి స్వర్ణ పూరిత సింహవాహనంలో తిరువీధి సేవ జరిపారు.

13 నుంచి నిత్యకల్యాణాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి వసంతోత్సవం జరపనున్నారు. శనివారం చక్రతీర్థం, ధ్వజావరోహణం, పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగియనుండగా స్వామి వారి నిత్యకల్యాణాన్ని 13 నుంచి తిరిగి ప్రారంభిస్తారు.

నియామకంలో నిబంధనలు సవరించాలి


మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పూర్వ వీఆర్వోలను గ్రామ పరిపాలన అధికారులుగా తీసుకోవాలని నిర్ణయించిన నేపథ్యాన నిబంధనలను సవరించాలని పలువురు కోరారు. ఖమ్మం టీటీడీసీలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల జేఏసీ చైర్మన్ షేక్ నాగుల్‌మీరా అధ్యక్షతన గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్, ట్రెసా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు సునీల్‌రెడ్డి, దొడ్డా పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి శ్రీనివాసరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బిక్కు, పూర్వ వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అజీజ్, పులుసు వెంకటేశ్వర్లు, షేక్ అన్వర్ తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 129లో పలు అంశాలను సవరించాలని, పూర్వ వీఆర్ఓలకు గత సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ఇతర శాఖల్లో కొనసాగాలనుకుంటే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

లక్ష్యసాధనలో వెనుకబాటు

- 2024–25లో చతికిలబడిన రవాణా శాఖ
- డీటీఓ లేకపోవడం.. సిబ్బంది కొరతతో ఇక్కట్లు


ఖమ్మం రవాణా శాఖ అధికారి కార్యాలయం

ఖమ్మంక్రైం: తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం (2024–25)లో ప్రభుత్వం నిర్ణయించిన ఆదాయాన్ని సాధించడంలోజిల్లా రవాణా శాఖ వెనుకబడింది. 2023–24లో వంద శాతం పన్నులు వసూలు చేసినప్పటికీ ఈ ఏడాది చతికిలబడడం గమనార్హం. జిల్లాలో ఖమ్మంతో పాటు సత్తుపల్లి, వైరాలో రవాణాశాఖ కార్యాలయాలు ఉండగా.. కల్లూరులో చెక్‌పోస్ట్ కొనసాగుతోంది. వీటన్నింటి ద్వారా ఏటా ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉండగా అలా జరగకపోవడానికి పలు అంశాలు కారణంగా నిలుస్తున్నాయి.

రూ.30.24కోట్లలో రూ.24.15కోట్లే..

2024–2025 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం జిల్లా రవాణాశాఖకు రూ.30.24కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించింది. కానీ రూ.24.15కోట్లే(82.23శాతం) వసూలు కాగా, రూ.5.29కోట్ల మేర సాధించలేకపోయారు.

రవాణాశాఖాధికారి లేక...

జిల్లాలో నెలల తరబడి నుంచి కీలకమైన రవాణాశాఖాధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టులో ఆఫ్రీన్‌ను నియమించగా సుమారు పది నెలల క్రితం ఆమె సెలవులో వెళ్లారు. ఆతర్వాత పోస్టును భర్తీ చేయకపోగా, సీనియర్ ఎంవీఐలతో కొనసాగిస్తున్నారు. వీరు ఓ కార్యాలయ విధులు నిర్వర్తిస్తూనే జిల్లా బాధ్యతలు చూసుకోవాల్సి ఉండడంతో భారం పడుతోందని చెబుతున్నారు. దీనికి తోడు ఇతర ఉద్యోగుల సహకారం లేకపోవడం కూడా ఇంకో కారణంగా తెలుస్తోంది. అంతేకాక సిబ్బంది కొరత కూడా రవాణా శాఖను వేధిస్తోంది. కొన్నాళ్ల క్రితం ఆరుగురు ఏఎంవీఐలను కేటాయించినా ఆర్థిక సంవత్సరం చివరలో వారు శిక్షణ నిమిత్తం వెళ్లగా పాత పరిస్థితులే పునరావృతమయ్యాయి. వాహనాలకు సంబంధించిన త్రైమాసిక పన్నులు సరిగా వసూలు కాకపోవడంతో లక్ష్యసాధనలో వెనకబడినట్లు తెలుస్తోంది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఇంకా లక్ష్యాన్ని నిర్దేశించలేదని.. ఈసారి ఎలాగైనా లక్ష్యాన్ని చేరతామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

శరవేగంగా ధాన్యం కాంటాలు

- మిల్లర్లు తరుగు తీస్తే సహించేది లేదు...
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు శరవేగంగా పూర్తిచేస్తూ ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. మండలంలో గురువారం ఆయన పర్యటించారు. నేలకొండపల్లిలో పంట కాల్వలు దాటుతూ పొలాలకు చేరిన కలెక్టర్ వరి కోతలపై ఆరా తీసి పెట్టుబడి, దిగుబడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే, బోదులబండ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలించారు. అనంతరం సమీప మామిడి తోటలో రైతులతో సమావేశమైన కలెక్టర్ వారి సమస్యలు ఆరా తీస్తూ పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు.

తరుగు తీస్తున్నారు సార్...

కొనుగోలు కేంద్రాల్లో కాంటా పూర్తయ్యాక మిల్లర్లు ధాన్యం తరుగు తీస్తున్నారని పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన సివిల్ సప్లయీస్ అధికారులు నేరుగా వెళ్లి తరుగు తీసింది నిజమేనని చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో ఆదేశించారు. ఇకపై ఎక్కడ మిల్లర్లు తరుగు తీయకుండా చూస్తామని రైతులకు భరోసా కల్పించారు. ఎవరైనా ఇబ్బంది నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతేకాక కాంటాల్లో వేగం పెంచుతామని, కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్‌లు సహా ఇతర వసతులు కల్పిస్తామని తెలిపారు. కాగా, పట్టా భూమిని మరొకరి పేరిట నమోదు చేశారని పిట్టల వెంకన్న, హైవేకు భూములు ఇచ్చిన రైతులు పంట కాల్వల వద్ద బుర్రలు వేయకుండా అడ్డుకుంటున్నారని బాజా నాగేశ్వరరావు ఫిర్యాదు చేయగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే, ఫుట్‌పాత్‌ల వెంట దుకాణాలు తీయించాలని సూచించారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఏడీఏ బి.సరిత, తహసీల్దార్ జె.మాణిక్‌రావు, ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, ఏఓ ఎం.రాధ, ఎంపీఓ శివ, బోదులబండ సొసైటీ చైర్మన్ అనంతు కాశయ్య, సీఈఓ అయినపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా బీజేపీ వైపే చూస్తున్నారు..

పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కల్లూరు: ప్రధాన మోదీ నేతృత్వాన కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. కల్లూరులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు ఆకర్షితులవుతున్నారని, ఈ కారణంగా గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను చూసిన ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ పట్టం కట్టడం ఖాయమని, ఈ విషయాన్ని గుర్తించి స్థానిక సంస్థల్లో సత్తా చాటేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈసమావేశంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈ.వీ.రమేష్, మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణతో పాటు ఆపద రామారావు, గుండపనేని అనిల్, టి.పెద్ద పుల్లారావు, మండవ వెంకట్రామిరెడ్డి, నరేష్, శీలం వెంకటమ్మ, పానుగంటి కృష్ణయ్య, పసుపులేటి సుబ్బారావు, జంగిలి దుర్గాప్రసాద్, కురువెళ్లి కృష్ణమాచారి, ఆనంగి నరసింహారావు, బుర్రి వెంకటరామయ్య, బానోత్ రాజ్ కుమార్, కేలోత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూసుకుపోతున్న దారి..

- మధిరలో మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులు
- రెండు వైపులా ప్రహరీ నిర్మాణంతో రాకపోకలకు ఇక్కట్లు


రైల్వే ట్రాక్ దాటుతున్న ప్రజలు


పాత రైల్వే గేట్ వద్ద ప్రహరీ నిర్మాణ పనులు

మధిర: రైల్వే శాఖ నిబంధనల ప్రకారం ట్రాక్ మీదుగా రాకపోకలు సాగించొద్దు. కానీ మధిర నడిబొడ్డున రైల్వే ట్రాక్ ఉండడంతో పట్టణం రెండుగా చీలిపోగా, రాకపోకలు తప్పడం లేదు. ఇన్నాళ్లు ఏ ఇబ్బంది ఎదురుకాకున్నా ఇప్పుడు మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా పాత రైల్వే గేట్ వద్ద సుమారు 10 అడుగుల మేర ప్రహరీ నిర్మించనున్నారు. ఈ గోడ నిర్మాణం పూర్తయితే రాకపోకలు నిలిచిపోయి ప్రజలకు ఇక్కట్లు తప్పవనే చెప్పాలి.

రెండు రాష్ట్రాల సరిహద్దు

నియోజకవర్గ కేంద్రమైన మధిర తెలంగాణ – ఏపీకి సరిహద్దుగా ఉండడంతో రెండు రాష్ట్రాలకు వివిధ పనుల నిమిత్తం రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. మధిరలో నివసించే వారికి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో పంట పొలాలు, వ్యాపారాలు, ఎన్టీఆర్ జిల్లా వాసులకు మధిరలో భూములు, వ్యాపారాలు ఉన్నాయి. ఈక్రమాన రాకపోకల సమయంలో రైల్వే ట్రాక్ దాటి ఓ వైపు నుంచి మరో వైపుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. వన్‌టౌన్ వైపు బ్యాంకులు, కోర్టులు, ఆర్అండ్‌బీ, వ్యవసాయ శాఖ, ప్రభుత్వాస్పత్రి, తహసీల్, మండల పరిషత్ తదితర కార్యాలయాలు.. టూ టౌన్‌లో ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, ఐసీడీఎస్, ఎక్సైజ్, సొసైటీ, విద్యుత్, ఇరిగేషన్ కార్యాలయాలు ఉన్నాయి. దీంతో రాకపోకలు తప్పనిసరి కావడంతో గేట్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి కానీ, రైల్వే అండర్ పాస్ కానీ నిర్మించలేదు. ఫలితంగా ప్రమాదమని తెలిసినా ట్రాక్ దాటాల్సి వస్తోంది. ఇప్పుడు గేటు వద్ద ప్రహరీ నిర్మించనుండడంతో వీరందరికీ ఇక్కట్లు తప్పవు.

ప్రత్యామ్నాయ మార్గం ఉండాలి

రైల్వే శాఖ నిబంధనల మేరకు రైల్వే గేట్ వద్ద ప్రహరీ గోడ నిర్మిస్తున్నా.. ప్రత్యామ్నాయంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే వివిధ కారణాలతో వ్యాపారాలు లేక దుకాణాలు బోసిపోతుండగా, రైల్వే ట్రాక్ వద్ద దారి మూసివేస్తే తమ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారుతుందని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేదా రైల్వే అండర్ పాస్ కానీ.. కనీసం అండర్ బ్రిడ్జి అయినా నిర్మించాలని కోరుతున్నారు.

గోడ నిర్మాణం ఆపాల్సిందే...


నిరసన తెలుపుతున్న నాయకులు, వ్యాపారులు

రైల్వే ట్రాక్ వద్ద గోడ నిర్మిస్తే వన్ టౌన్ – టూ టౌన్ మధ్య రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోందని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు మందా సైదులు, పడకంటి మురళి తెలిపారు. ఈమేరకు ప్రహరీ నిర్మాణ పనుల వద్ద గురువారం వారు వ్యాపారులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకపోగా, రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నడక మార్గాన్ని కూడా మూసివేయాలనే ఆలోచన సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వడ్రాణపు మధు తదితరులు ఉన్నారు.

ఇప్పటికే ఇబ్బందులు...



ప్రస్తుతం రైల్వే ట్రాక్ మీదుగా జనం వచ్చివెళ్తున్నారు. దీంతో కొద్దోగొప్పో బేరాలు అవుతున్నాయి. ఇప్పుడు రైల్వే ట్రాక్ వద్ద ప్రహరీ నిర్మిస్తే అంతంత మాత్రంగా ఉన్న వ్యాపారాలు దెబ్బతినడం ఖాయం.

– మల్లాది శివచౌదరి, వన్ టౌన్, మధిర

ప్రత్యామ్నాయం చూపాలి



రైల్వే అధికారులు నిబంధనల పేరిట గేట్ వద్ద గోడ నిర్మిస్తున్నారు. కానీ ప్రత్యామ్నాయ మార్గం చూపకపోతే ప్రజలు ఎలా వచ్చివెళ్తారో ఆలోచించాలి. ప్రధానంగా వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడతారు.

– ఎం.కాశీవిశ్వేశ్వరరావు, వన్ టౌన్, మధిర

కామెర్లతో బాధపడుతూ మృతి


గణేష్ (ఫైల్)

మధిర: కొద్దిరోజులుగా కామెర్లతో బాధపడుతున్న యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మధిర బంజారా కాలనీకి చెందిన ధీరావత్ గణేష్(28) ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తుండగా, కొద్దిరోజుల క్రితం మరికొందరి స్నేహితులతో ఇటీవల ఒక సెంటర్‌లో ఫాస్ట్ ఫుడ్ తిన్నాడు. అందరూ ఫుడ్ ఇన్‌ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురికాగా, కామెర్లు వచ్చినట్లు తెలిసింది. మిగిలిన వారికి చికిత్సతో నయం కాగా, గణేష్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉండగా ప్రస్తుతం భార్య గర్భిణి కావడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాణ్యత పాటించకపోవడంతో పాటు గణేష్ ఆరోగ్యం కుదుటపడక ఇలా జరిగిందని చెబుతున్నారు.

మృతుడి గుర్తింపు.. అంత్యక్రియలు


మృతదేహం వద్ద కుటుంబీకులు, ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఏన్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ వ్యక్తి మృతి మృతదేహాన్ని గుర్తించగా, ఆయన ఆచూకీ తెలియకపోవడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. పత్రికల ద్వారా విషయం తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం చుంచుపల్లి వాసులు, కుటుంబీకులు ఆ మృతదేహం గోడి విజయబాబుదిగా గుర్తించారు. విజయబాబు మతిస్థిమితం కోల్పోయినట్లు చెబుతూ, అంత్యక్రియలు నిర్వహించే స్థోమత లేదని అన్నం ఫౌండేషన్‌ను సంప్రదించారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు నేతృత్వాన బల్లేపల్లి వైకుంఠధామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

మధిర టీచర్స్ కాలనీలో చోరీ

మధిర: మధిర టీచర్స్ కాలనీలోని ఓ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటాక చోరీ జరిగింది. కాలనీకి చెందిన భీమరశెట్టి శ్రీనివాసరావు – సత్యావతి దంపతులు రెండు రోజుల క్రితం భద్రాచలంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈక్రమంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి లోపలకువెళ్లి బీరువాలో దాచిన మూడు జతల వెండి పట్టీలను అపహరించారు. ఇళ్లంతా కలియదిరిగినా విలువైన వస్తువులు లభించక వెనకాల ప్రహరీ దూకి పరారైనట్లు గుర్తించారు. ఈ విషయాన్ని గురువారం ఉదయం గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో శ్రీనివాసరావు చేరుకుని చోరీపై మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఖమ్మం క్లూస్ టీం నేతృత్వాన దర్యాప్తు చేపట్టారు.